# ప్రభాత ఉదయం

తెలుగు దినపత్రిక





పాఠకులకు, ప్రకటనకర్తలకు, శ్రేయోభిలాషులకు

సంక్రాంతి శుభాకాంక్షలు

నేడు మా కార్యాలయానికి సెలవు.
కావున శుక్రవారం సంచిక వెలువడదు.
పునర్దర్శనం శనివారం

మేకల దామోదర్ రెడ్డి మేనేజింగ్ డైరెక్టర్ (ప్రభాత ఉదయం)



సంపుటి: 3 | సంచిక: 276 | పేజీలు: 5 | వెల: రూ.3/- | గురువారం జనవరి 15 2026 | ఎడిటర్: ఎం.దామోదర్ రెడ్డి




## మహిళా ఐఎఎస్‌పై అసభ్యకర కథనాలు

**అందుకే చట్టప్రకారం విలేకర్ల అరెస్ట్**

**విచారణకు రమ్మంటే పారిపోతే ఎలా**

**మీడియాతో నగర పోలీస్ కమిషనర్ సజ్జన్నార్**

హైదరాబాద్, జనవరి14 (ప్రభాత ఉదయం)

ఒక మహిళా ఐఏఎస్ అధికారిపై వ్యక్తిగత విమర్శలు చేసిన వ్యవహారంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు హైదరాబాద్ సీపీ సజ్జనార్ తెలిపారు. ఈ కేసులో మీడియా ప్రతినిధుల అరెస్టుపై సీపీ

## జర్నలిస్టుల అరెస్ట్ దుర్మార్గం

**పండగపూట కక్షసాధింపు చర్యలు తగవు**

**బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు విమర్శలు**

హైదరాబాద్,జనవరి14 (ప్రభాత ఉదయం)



ఎన్టీవీ జర్నలిస్టుల అక్రమ అరెస్టును మాజీ మంత్రి హరీశ్‌రావు తీవ్రంగా ఖండించారు. పాలన చేతగాని సర్కారు.. పండగ పూట జర్నలిస్టులపై కక్ష్య సాధింపు చర్యలకు దిగటం సిగ్గుచేటు అని విమర్శించారు. మీ రాజకీయ వికృత క్రీడల్లో ..మిగతా 2లో

# అంతర్జాతీయ పండుగలా పొంగల్

**తమిళ సంస్కృతిని ప్రేమించే వారిలో నేనూ ఒకడిని : ప్రధాని మోదీ**

**తమిళ సంస్కృతి యావత్ దేశ ఉమ్మడి సంస్కృతి**

**సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపిన మోదీ**

**కేంద్ర మంత్రి ఎల్ మురుగన్ నివాసంలో పొంగల్ వేడుకలకు ప్రధాని హాజరు**



న్యూఢిల్లీ, జనవరి 14 (ప్రభాత ఉదయం)

ఇప్పుడు పొంగల్ అంతర్జాతీయ పండుగగా మారిందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. తమిళులతో పాటు యావత్ ప్రపంచంలో తమిళ సంస్కృతిని ప్రేమించే వారు ఆనందోత్సాహాలతో పొంగల్ వేడుకను జరుపుకుంటారని ఆయన పేర్కొన్నారు. తమిళ సంస్కృతిని ప్రేమించే వారిలో తాను కూడా ఒకడినని మోదీ తెలిపారు. అందరితో కలిసి పొంగల్ వేడుకలలో భాగం కావడాన్ని తాను ప్రత్యేక గౌరవంగా భావిస్తున్నానని చెప్పారు. ఇప్పుడు పొంగల్ అంతర్జాతీయ పండుగగా మారిందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. తమిళులతో పాటు యావత్ ప్రపంచంలో తమిళ సంస్కృతిని ప్రేమించే వారు ఆనందోత్సాహాలతో పొంగల్ వేడుకను జరుపుకుంటారని ఆయన పేర్కొన్నారు. తమిళ సంస్కృతిని ప్రేమించే వారిలో తాను కూడా ఒకడినని మోదీ తెలిపారు. అందరితో కలిసి పొంగల్ వేడుకలలో భాగం కావడాన్ని తాను ప్రత్యేక గౌరవంగా భావిస్తున్నానని చెప్పారు. బుధవారం దేశ రాజధాని దిల్లీలో కేంద్ర మంత్రి ఎల్ మురుగన్ నివాసంలో ..మిగతా 2లో

# తెలుగు రాష్ట్రాల్లో సంక్రాంతి సందడి



**ఎపిలో పలు ప్రాంతాల్లో కోడి పందాలు**


**భారీగా తరలిచ్చిన తెలుగు రాష్ట్రాల వీక్షకులు**

**ఎల్ఇడి స్క్రీన్‌లు ఏర్పాటు చేసిన నిర్వాహకులు**

**ఎమ్మెల్యేలు, ఎంపీలు నేతల రాకతో హడావిడి**

విజయవాడ, జనవరి14 (ప్రభాత ఉదయం)

తెలుగు రాష్ట్రాల్లో సంక్రాంతి సందడి కొనసాగుతోంది. వేడుకల్లో భాగంగా ఏపీలోని పలు ప్రాంతాల్లో కోడిపందేలు జోరుగా మొదలయ్యాయి. బరుల వద్ద పందెం రాయుళ్లు, వీక్షకులతో కోలాహలం నెలకొంది. తూర్పు గోదావరి, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ, పశ్చిమగోదావరి, ఏలూరు, పోలవరం, కృష్ణా జిల్లాలోని పలు ప్రాంతాల్లో బరుల వద్ద సందడి వాతావరణం నెలకొంది. పశ్చిమగోదావరి జిల్లా కాళ్ల మండలం పెదఅమిరంలో కోడిపందేలను డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, హైదరాబాద్ మాజీ మేయర్ తీగల కృష్ణారెడ్డి తదితరులు తిలకించారు. బరుల వద్ద పందెం రాయుళ్లు, వీక్షకులతో కోలాహలం నెలకొంది. సంప్రదాయంగా భావించే ఈ కార్యక్రమాలు ముఖ్యంగా తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణా, ఏలూరు, కాకినాడ, అనకాపల్లి తదితర ప్రాంతాల్లో పెద్దఎత్తున జరుగుతున్నాయి. చాలా ప్రాంతాల్లో కోడి పందేలకు బరులు ..మిగతా 2లో



## మకరజ్యోతి దర్శనం

**మార్మోగిన స్వామి శరణం నామస్మరణం**

**పులకించిపోయిన అయ్యప్ప భక్తులు**

తిరువనంతపురం, జనవరి14 (ప్రభాత ఉదయం)

శబరిగిరులపై మకర జ్యోతి దర్శనమిచ్చింది. దాంతో స్వామియే శరణం అయ్యప్ప నామస్మరణల మధ్య మకర జ్యోతిని అయ్యప్ప మాలధారణలో ఉన్న స్వాములు భక్తి తన్మయత్వంతో దర్శించుకున్నారు. జనవరి 14వ తేదీ మకర సంక్రాంతి సందర్భంగా సాయంత్రం 6.30 గంటల నుంచి 6.45 గంటల మధ్య మకర జ్యోతి దర్శనమిచ్చింది. అయితే ఈ సారి మకరవిలక్కు ఉత్సవాలకు వస్తున్న భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని ఉన్నతాధికారులు కీలక ..మిగతా 2లో



## ఉరితాళ్లుగా చైనా మాంజా

**సంగారెడ్డి జిల్లాలో దారుణం**

**బైకర్ మెడకు తగిలి కోసుకున్న మెడ**

**తీవ్రగాయంతో మృతి చెందిన వ్యక్తి**

సంగారెడ్డి,జనవరి14 (ప్రభాత ఉదయం)

సంగారెడ్డి మండలం పసల్వాడి గ్రామంలో భయానక ఘటన చోటుచేసుకుంది. చైనా మాంజా మెడకు తగిలి గొంతు కోసుకు పోవడంతో ఓ ద్విచక్రవాహనదారుడు ప్రాణాలు కోల్పోయాడు. మృతుడిని బిహార్‌కి చెందిన అద్వైక్‌గా గుర్తించారు పోలీసులు. కొంతకాలంగా అతడు పసల్వాడిలోని ఓ పరిశ్రమలో కార్మికుడిగా పని చేస్తున్నాడు. బుధవారం అతను బైక్‌పై వెళ్తుండగా చైనా మాంజా రోడ్డుకు అడ్డంగా వేళాడుతోంది. అది కంటికి కనిపించకపోవడంతో ఒక్కసారిగా అతని గొంతుకు ..మిగతా 2లో

## గ్రామ పంచాయతీలకు కేంద్ర నిధులు

**వెల్లడించిన కిషన్‌రెడ్డి**

హైదరాబాద్, జనవరి 14 (ప్రభాత ఉదయం)



తెలంగాణలోని గ్రామ పంచాయతీలు, స్థానిక సంస్థల బలోపేతానికి కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. గ్రామీణ స్థాయిలో ప్రజాస్వామ్య వ్యవస్థలను మరింత బలపరిచే లక్ష్యంతో నిధులను విడుదల చేయనున్నట్లు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు.

గత పదేళ్లుగా ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రంలోని గ్రామ పంచాయతీలు, స్థానిక సంస్థలకు కేంద్ర ప్రభుత్వం రూ.11 వేల కోట్లకు పైగా నిధులు విడుదల చేసింది. 2015-16 నుంచి 2019-20 మధ్యకాలంలో రూ.5,060 కోట్లను మంజూరు చేయగా, 2020-21 నుంచి 2025-26 కాలానికి నిధులను 80 శాతం పెంచి రూ.9,050 కోట్లకు కేటాయించారు. ఇందులో ఇప్పటికే రూ.6,051 కోట్లను విడుదల చేసినట్లు మంత్రి వెల్లడించారు.గ్రామీణ స్థాయిలో ప్రజాప్రతినిధ్య సంస్థలు బలంగా ఉంటే ..మిగతా 2లో

## ఉత్తరాఖండ్‌లో వింత సమస్య

**సరిహద్దు గ్రామాలకు**

**నేపాలీ టెలికాం కంపెనీల నుంచి సిగ్నల్స్-**

**యూజర్లుకు తీవ్ర ఇబ్బందులు**

న్యూఢిల్లీ, జనవరి 14 (ప్రభాత ఉదయం)



ఆ రాష్ట్రంలోని గ్రామాలకు నేపాలీ టెలికాం కంపెనీల నుంచి మొబైల్ సిగ్నల్స్- దీంతో ఇబ్బందులు పడుతున్న ఫోన్ వినియోగదారులు- తమ ప్రాంతంలో టవర్లు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి మనం ఫోన్‌లో మాట్లాడాలన్నా, వీడియో కాల్ చేయాలన్నా, గూగుల్ సెర్చ్ చేయాలన్నా, ..మిగతా 2లో

# ఉత్తరాఖండ్‌లో వింత సమస్య

మొదటి పేజీ తరువాయి...

యూట్యూబ్ చూడాలన్నా సిగ్నల్స్ ఉండాల్సిందే. లేదంటే ఇవేవీ సాధ్యం కాదు. అయితే మన దేశంలోని ఓ ప్రాంతానికి పొరుగు దేశం నుంచి మొబైల్ సిగ్నల్స్ వస్తున్నాయి. ఈ క్రమంలో అందుకు గల కారణాలు ఏంటి? భారతీయులు సిగ్నల్స్ అందుకుంటున్న వేరే దేశమేదో? తెలుసుకుందాం పదండి.

**నేపాల్ నుంచి భారతీయులకు సిగ్నల్స్**

ఉత్తరాఖండ్ సరిహద్దులో ఉన్న పిథోర్‌గఢ్ జిల్లా నేపాల్‌తో బోర్డర్‌ను పంచుకుంటోంది. ఈ జిల్లాలోని అనేక గ్రామాలకు భారతీయ టెలికాం కంపెనీల నుంచి కాకుండా నేపాలీ టెలికాం కంపెనీల నుంచి సిగ్నల్స్ వస్తున్నాయి. జిల్లా ప్రధాన కార్యాలయం పిథోర్‌గఢ్ నుంచి కేవలం 18-20 కి.మీల దూరంలో ఉన్న కొన్ని గ్రామాల్లో భారతీయ టెలికాం కంపెనీలకు సంబంధించిన టవర్లు ఎక్కువగా లేవు. దీంతో సరైన సిగ్నల్స్ రాకపోవడంతో ఆ ఊర్ల ప్రజలకు తిప్పలు తప్పట్లేదు. దీంతో మొబైల్ యూజర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వీడియో కాల్స్, ఇతర సేవల కోసం నానావస్థలు పడుతున్నారు.

పిథోర్‌గఢ్ జిల్లాలోని మునకోట్ బ్లాక్ నేపాల్ సరిహద్దుకు ఆనుకొని ఉంది. అయితే భారత భూభాగంలో పరిమిత టెలికాం కంపెనీల టవర్లు మాత్రమే ఉన్నాయి. దీంతో మునకోట్ లోని వడ్డా, బాడాల్, ఝులఘాట్ పరిసర గ్రామాలు వీక్ సిగ్నల్స్ సమస్యను ఎదుర్కొంటున్నాయి. అంతేకాకుండా నేపాల్‌లోని టవర్ల నుంచి ఆ గ్రామాల మొబైల్ వినియోగదారులకు సిగ్నల్స్ వస్తున్నాయి. అయితే దేశీయ టెలికాం కంపెనీల నుంచి మొబైల్ సిగ్నల్స్ రాకపోవడం ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

**విద్యార్థులకు అవస్థలు**

సరిగ్గా సిగ్నల్స్ అందకపోవడం విద్యార్థులు ఆన్‌లైన్‌లో చదువుకోలేకపోతున్నారని సమస్య ఎదుర్కొంటున్న గ్రామస్థులు చెబుతున్నారు. వంట గ్యాస్‌ను కూడా బుకింగ్ చేసుకోలేకపోతున్నామని వాపోతున్నారు. వీడియో కాల్ ఇప్పటికీ తమకు ఒక కలగానే మిగిలిపోయిందని అంటున్నారు.

ప్రపంచం డిజిటల్ యుగంలో ఉన్నప్పటికీ, తాము పురాతన కాలంలో జీవిస్తున్నట్లు అనిపిస్తుందని సామాజిక కార్యకర్త అనిల్ చంద్ తెలిపారు. "మా గ్రామం పిథోర్ గఢ్ జిల్లా ప్రధాన కార్యాలయం నుంచి కేవలం 18 కిలోమీటర్ల దూరంలో ఉంది. మా ఊర్లో జనాభా కాస్త ఎక్కువ. మొబైల్ సిగ్నల్ రాకపోవడం వల్ల మట్కోడా, బసేరా, సిర్కుచ్, జఖ్పంత్, మజిర్కండ, చ్యాడి, జర్మాని, ధోలాఖోల్, కటియాని ప్రజలు సమస్యలు ఎదుర్కొంటున్నారు. మాయలేఖ్‌లో టవర్ ఏర్పాటు చేస్తే మా గ్రామాల్లో కమ్యూనికేషన్ సేవలను మెరుగుపర్చవచ్చు" అని అనిల్ చంద్ పేర్కొన్నారు.

సిగ్నల్ సమస్యతో ప్రజలు ఇబ్బందులు

నేపాల్ సరిహద్దులో ఉన్న కనాలిచ్చినా, ధార్చులా డెవలప్ మెంట్ బ్లాక్‌లలో వేలాది మంది ఇప్పటికీ మొబైల్ సిగ్నల్ సమస్యతో ఇబ్బంది పడుతున్నారు. ధార్చులా-పంచేశ్వర్ వరకు 100 కిలోమీటర్ల విస్తీర్ణంలో భారతీయ మొబైల్ కంపెనీలకు బదులుగా నేపాలీ టెలికాం కంపెనీల నుంచి సిగ్నల్స్ అందుకుంటున్న గ్రామాలు ఇప్పటికీ చాలా ఉన్నాయి. బీఎస్ఎన్ఎల్‌తో సహా ప్రైవేట్ కంపెనీలు చాలా ప్రాంతాలలో టవర్లను ఏర్పాటు చేశాయి. అయినప్పటికీ యూజర్లకు ఇప్పటికీ సరైన సిగ్నల్స్ రావడం లేదు.

పిథోర్‌గఢ్ జిల్లాలోని కొన్ని గ్రామాల ప్రజలు ఎదుర్కొంటున్న సిగ్నల్స్ సమస్యపై ఆ జిల్లా కలెక్టర్ ఆశిశ్ స్పందించారు. ఈ సమస్యపై మొబైల్ కంపెనీలతో చర్చలు జరుగుతున్నాయని అన్నారు. "ఇప్పటికే ఈ విషయంలో బీఎస్ఎన్ఎల్‌కు ఆదేశాలు జారీ చేశాం. జిల్లాలోని కమ్యూనికేషన్ సేవలు లేని ప్రాంతాల్లో త్వరలో టవర్లను ఏర్పాటు చేస్తామని బీఎస్ఎల్ హామీ ఇచ్చింది.

## మహిళా ఐఏఎస్‌పై అసభ్యకర కథనాలు

మొదటి పేజీ తరువాయి...



స్పందించారు. మీడియా ప్రతినిధులు విచారణకు సహకరించాలన్నారు. నిందితులు ఎక్కడున్నా పట్టుకొస్తాం. ఓ టీవీ ఛానెల్ సీఈవో ఎక్కడ ఉన్నారని ప్రశ్నించారు. పిలిస్తే.. విచారణకు రావాలి కదా అంటూ.. రిపోర్టర్లు ఎందుకు పారిపోతున్నారని అన్నారు.అప్పటికప్పుడు ఫ్లైట్ టికెట్లు బుక్ చేసుకుని బ్యాంకాక్ పారిపోయేందుకు ప్రయత్నిస్తేనే అదుపులోకి తీసుకున్నాం. మరో రిపోర్టర్ విచారణకు వస్తానని చెప్పి సెల్ ఫోన్ స్విచ్ఛాఫ్ చేసుకున్నారు. అందుకే వారిని అరెస్ట్ చేసి విచారిస్తున్నాం.త్వరలోనే అన్ని వివరాలు వెల్లడిస్తాం అంతా చట్ట ప్రకారమే చేస్తాం. చట్టం తనపని తాను చేసుకుపోతుందని సజ్జన్నార్ అన్నారు. ప్రజా జీవితంలో విమర్శలు సహజం. విమర్శలు సహేతుకంగా ఉండాలి. ఎలాంటి ఆధారాలు లేకుండా మహిళా అధికారిపై వ్యక్తిగత విమర్శలు చేయడం క్రూరత్వమే అవుతుందన్నారు. మహిళలు అన్ని రంగాల్లో విజయాలు సాధిస్తున్నారు. మహిళా అధికారులపై అసత్య కథనాలు ప్రసారమైతే వాళ్లు సమాజంలో ఎలా పనిచేయగలుగుతారని నిలదీసారు. మహిళా అధికారులను కించపరుస్తూ వార్తలు ఎలా రాస్తారు. అందరూ ఆత్మ విమర్శ చేసుకోవాలి. సీఎంపై అవమానకర వార్తలు వేయడంతో మరో కేసు నమోదైంది. ఈ రెండు కేసులకు సంబంధించి సిట్ విచారణ జరుపుతోందని సీపీ తెలిపారు.

## జర్నలిస్టుల అరెస్ట్ దుర్మార్గం

మొదటి పేజీ తరువాయి...

తెలంగాణ ఉద్యమకారులైన జర్నలిస్టులను బలి చేస్తారా అని మండిపడ్డారు. ఇళ్లల్లో చొరబడి అర్ధరాత్రి వేళ అరెస్టులు చేయడానికి వాళ్లేమైన తీవ్రవాదులా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. జర్నలిస్టుల వరుస అరెస్టులను తీవ్రంగా ఖండిస్తున్నామని హరీశ్‌రావు అన్నారు. ఇది ప్రజాస్వామ్యంపై రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేస్తున్న దాడి అని ఆరోపించారు. తెలంగాణ జర్నలిస్టుల ఆత్మగౌరవంపై పని గట్టుకొని కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ప్రత్యక్ష దాడి అని అన్నారు. జర్నలిస్టుల అరెస్టులు, మీడియా- డిజిటల్ మీడియాపై సిట్లతో ఎవర్ని కాపాడుతున్నారు? ఎవరిని వేటాడుతున్నారు? అని ప్రశ్నించారు. మీ స్వార్థ రాజకీయాల కోసం ప్రజాస్వామ్య హననానికి పాల్పడటం దుర్మార్గమని మండిపడ్డారు. రేవంత్ రెడ్డి.. ఇదేనా నీ ప్రజాపాలన? ఇదేనా మీరు చెప్పిన ప్రజాస్వామ్య పునరుద్ధరణ? అని ప్రశ్నించారు. అరెస్ట్ చేసిన జర్నలిస్టులను తక్షణం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎన్టీవీ ఇన్‌పుట్ ఎడిటర్ దొంతు రమేశ్, రిపోర్టర్లు పరిపూర్ణచారి, సుధీర్‌లను మంగళవారం రాత్రి పోలీసులు అరెస్టు చేశారు. కుటుంబంతో విదేశాలకు వెళ్తుండగా దొంతు రమేశ్‌ను హైదరాబాద్ ఎయిర్‌పోర్టులో అరెస్టు చేయగా.. మరో ఇద్దరు రిపోర్టర్లను సైతం అదుపులోకి తీసుకున్నారు. మహిళా ఐఏఎస్, మంత్రి వార్త వ్యవహారంలో ఎన్టీవీ న్యూస్ ఛానల్‌పై చర్యలకు సిద్ధమైన తెలంగాణ ప్రభుత్వం.. ఈ మేరకు జర్నలిస్టులను అరెస్టు చేశారు.

## తెలుగు రాష్ట్రాల్లో సంక్రాంతి సందడి

మొదటి పేజీ తరువాయి...

ముస్తాబయ్యాయి. ఈ పందేలను చూసేందుకు దూరప్రాంతాల ప్రజలు సైతం పెద్దఎత్తున తరలివస్తున్నారు. బరుల్లో ఎల్ఈడీ స్క్రీన్లను ఏర్పాటుచేశారు నిర్వాహకులు. అయితే.. గతంలో లాగానే ఈసారీ కోట్ల రూపాయల్లో పందేలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. కోనసీమ జిల్లా అమలాపురంలో కోడిపందేలు, గుండాటలు ప్రారంభమయ్యాయి. ప్రతి గ్రామంలోనూ కోడిపందేలు, గుండాటలు ఏర్పాటయ్యాయి. 'మూడు బరులు.. ఆరు బోర్డులు' అన్నట్లు నిర్వాహకులు ఏర్పాట్లుచేశారు. జిల్లా వ్యాప్తంగా దాదాపు 150కిపైగా కోడిపందేల బరులు ముస్తాబయ్యాయి. గుడివాడ నియోజకవర్గంలో సంక్రాంతి కోడిపందేలు పెద్దఎత్తున జరుగుతున్నాయి. కోడిపందేలు, కోత ముక్కలో లక్షలాది రూపాయలు చేతులు మారుతున్న పరిస్థితి. బరులు జాతరను తలపిస్తున్నాయి. హోరాహోరీగా కోడి పందేలు జరుగుతున్నాయి. కోడి పందేలను చూసేందుకు జనం పెద్దఎత్తున తరలివచ్చారు. గుడివాడ రూరల్, నందివాడ, గుడ్లవల్లేరు మండలాల్లో బరులను ఏర్పాటుచేశారు. ఏలూరు జిల్లా కైకలూరు నియోజకవర్గంలో కోడి పందేలు జోరుగా మొదలయ్యాయి. కైకలూరు మండలం భుజబలపట్నంలో ఎల్ఈడీ స్క్రీన్‌లను ఏర్పాటుచేసి మరీ కోడిపందేలను నిర్వహిస్తున్నారు. ఈ పందేలను ఎమ్మెల్సీ జయమాంగళ వెంకటరమణ తిలకించారు. కాకినాడ జిల్లా పెద్దాపురం, జగ్గంపేట నియోజకవర్గాల్లో కోడిపందేలు ప్రారంభమయ్యాయి. బరుల్లో భారీ లైవ్ స్క్రీన్లను ఏర్పాటుచేయడంతో పాటు నాయకులు, ప్రజలు కూర్చుని చూసేందుకు బరిచుట్టూ స్టేజ్‌ను నిర్వాహకులు ఏర్పాటుచేశారు.

## గ్రామ పంచాయతీలకు కేంద్ర నిధులు

మొదటి పేజీ తరువాయి...

పాలనలో బాధ్యత, పారదర్శకత పెరుగుతాయని కేంద్ర ప్రభుత్వం గట్టిగా విశ్వసిస్తోందని కిషన్ రెడ్డి తెలిపారు. అందుకే స్థానిక సంస్థలకు నిధులను సకాలంలో విడుదల చేస్తోందన్నారు. తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికలు పూర్తవడం, 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వినియోగ ధృవీకరణ పత్రాలు రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల సమర్పించడంతో, 2024-25 సంవత్సరానికి సంబంధించిన తొలి విడతగా రూ.260 కోట్లను త్వరలోనే కేంద్ర ప్రభుత్వం విడుదల చేయనున్నట్లు తెలిపారు. యూసీలు సమర్పించిన వెంటనే మిగిలిన సుమారు రూ.2,500 కోట్లను దశలవారీగా విడుదల చేస్తామని స్పష్టం చేశారు.

కేంద్ర మార్గదర్శకాల ప్రకారం ప్రతి గ్రామ పంచాయతీకి ప్రత్యేక బ్యాంక్ ఖాతా ఉండాలని, ఆ ఖాతా పీఎఫ్ఎంఎస్ (ఖ్రీమీ) పోర్టల్‌లో యూనిక్ ఏజెన్సీ కోడ్‌తో నమోదు అయి ఉండాలని మంత్రి గుర్తు చేశారు. అయితే గత బీఆర్ఎస్ ప్రభుత్వం గ్రామ పంచాయతీల బ్యాంక్ ఖాతాలను అటాచ్ చేసి, ఆ నిధులను ఇతర అవసరాలకు మళ్లించిందని ఆయన ఆరోపించారు. దీని వల్ల తమ పదవీకాలంలో చేసిన పనులకు డబ్బులు రాక పలువురు సర్పంచులు రాజీనామాలు చేయాల్సి వచ్చిందన్నారు. కొన్ని దురదృష్టకర ఘటనల్లో సర్పంచులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని పేర్కొంటూ, ఇది అత్యంత విచారకరమని తెలిపారు.

ఈ నేపథ్యంలో గ్రామీణ అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలకు తెలంగాణ ప్రభుత్వం పూర్తి సహకారం అందించాలని కిషన్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. గ్రామీణ మౌలిక వసతుల అభివృద్ధితో పాటు 'వికసిత్ భారత్‌' లక్ష్య సాధనకు రాష్ట్ర ప్రభుత్వం బాధ్యతగా వ్యవహరించాలని ఆయన కోరారు.

## ఉరితాళ్లుగా చైనా మాంజా

మొదటి పేజీ తరువాయి...

చుట్టుకుని కోసేసింది. ఈ ప్రమాదంలో తీవ్ర రక్తస్రావంతో బాధితుడు ప్రాణాలు కోల్పోయాడు. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే అతడిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించినా ఫలితం లేకుండా పోయింది. మాంజా గొంతుకు లోతుగా కోసుకోవడంతో అద్విక్ మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ ఘటనతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. చైనా మాంజా వల్ల మనుషులు, పక్షులు, జంతువులు తీవ్ర ప్రమాదంలో పడుతున్నాయని ఇప్పటికే నిపుణులు హెచ్చరికలు జారీ చేశారు. అయినప్పటికీ చైనా మాంజా విక్రయాలు కొనసాగుతుండటంతో అనేక మంది గాయపడుతున్నారు. కాగా.. తెలంగాణలో చైనా మాంజా విక్రయం, వినియోగం, రవాణా పూర్తిగా నిషేధించిన విషయం తెలిసిందే. హైదరాబాద్‌లో పోలీసులు ముమ్మరంగా దాడులు నిర్వహించారు. ఈ క్రమంలో హైదరాబాద్‌లో రూ.1.24కోట్ల విలువైన చైనా మాంజా స్వాధీనం చేసుకున్నారు. చైనా మాంజా విక్రయిస్తున్న వ్యక్తులపై కేసులు నమోదు చేసిన పోలీసులు దాదాపు 143 మందిని అరెస్టు చేశారు. వేలాదిగా బాబిన్లను పట్టుకున్నారు. అటు సిద్దిపేట, సంగారెడ్డి జిల్లాల్లోనూ పోలీసులు తనిఖీలు చేసి.. చైనా మాంజా విక్రయిస్తున్న వారిపై కేసులు నమోదు చేశారు. చైనా మాంజాను పూర్తిగా నిషేధించాలని.. ఎక్కడైనా ఈ మాంజాను విక్రయించినా, వినియోగించినా సమాచారం ఇవ్వాలని ప్రజలకు పోలీసులు విజ్ఞప్తి చేశారు.



## కర్నాటకలోనూ చైనా మంజా పంజా

**బైక్‌పై వెళుతుండగా చుట్టుకున్న మంజా**

**తీవ్ర రక్త స్రావతంతో అక్కడిక్కడే మృతి**

బెంగళూరు, జనవరి 14 (ప్రభాత ఉదయం)

చైనా మాంజా యమ పాశంగా మారి దేశవ్యాప్తంగా అనేక మందిని బలి తీసకుంటోంది. తాజాగా కర్ణాటకకు చెందిన ఓ బైకర్ ఈ మాంజా కారణంగా దుర్మరణం చెందారు. బీదర్ జిల్లా తలమడగి వంతెన సమీపంలో ఈ ఘటన జరిగింది. బాధితుడిని సంజు కుమార్ హళసమణిగా గుర్తించారు. హళసమణి బైక్ డ్రైవ్ చేసుకుంటూ వెళుతున్న సమయంలో ఈ ప్రమాదం జరిగింది. ఆయన మెడకు మాంజా చుట్టుకోవడంతో కోసుకుపోయి గాయాలయ్యాయి. తీవ్ర రక్తస్రావమైంది. ఆయన తన కూతురికి ఫోన్ చేసి సమాచారం అందించే ప్రయత్నంలో ఉండగానే కుప్పకూలిపోయారు. చుట్టుపక్కల వారు గాయాలకు కర్చీఫ్‌లను అడ్డుపెట్టి రక్తస్రావాన్ని ఆపే ప్రయత్నం చేశారు. మరికొందరు అంబులెన్స్‌ను పిలిపించారు. అయితే, బాధితుడిని ఆసుపత్రికి తరలించే క్రమంలోనే కన్నుమూశారు. హళసమణి మృతికి అధికారుల నిర్లక్ష్యమే కారణమని ఆయన కుటుంబసభ్యులు ఆరోపించారు. అంబులెన్స్ సకాలంలో వచ్చి ఉంటే ఆయన ప్రాణాలతోనే ఉండి ఉండేవారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ జాప్యమే ఆయన ప్రాణాలను తీసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఘటన జరిగిన ప్రాంతంలో మృతుడి బంధువులు, స్థానికులు ధర్నాకు దిగారు. ఎమ్జ్గ్గ÷న్సీ సర్వీసులను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చైనా మాంజాపై నిషేధాన్ని పూర్తి స్థాయిలో అమలు చేయాలని కోరారు. ఇక ఈ ఘటనపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. దర్యాప్తు ప్రారంభించామని పోలీసులు తెలిపారు. మకర సంక్రాంతిని పురస్కరించుకుని దేశవ్యాప్తంగా గాలిపటాలను ఎగురవేయడం సంప్రదాయంగా వస్తున్న విషయం తెలిసిందే. అయితే, గాలిపటాల కోసం సాధారణ మాంజాలకు బదులుగా కొందరు చైనా మాంజాలను వినియోగించడంతో ప్రమాదాలు ఎదురవుతున్నాయి. విద్యుత్ స్తంభాలు, వైర్ల నుంచి వేళ్లాడే మాంజాలు వాహనదారులకు చుట్టుకుని ప్రమాదాలకు కారణమవుతున్నాయి. ముఖ్యంగా టూవీలర్స్‌పై ప్రయాణించే వారికి ఇవి యమ పాశాలుగా మారుతున్నాయి.

## మకరజ్యోతి దర్శనం

మొదటి పేజీ తరువాయి...



నిర్ణయం తీసుకున్నారు.కేరళ హైకోర్టు ఆదేశాలతో దర్శన కోటాపై ఆంక్షలు విధించిన సంగతి తెలిసిందే. దాంతో పోలీసులు పక్కాగా భద్రతా ఏర్పాట్లు చేశారు. ఈ మకర దర్శనం కోసం సన్నిధానం, పంబ, శబరిమల కొండ, నీలిమల ప్రాంతాలు అయ్యప్ప స్వాములతో కిక్కిరిసిపోయాయి. దాంతో బుధవారం ఉదయం 10గంటల తర్వాత పంబ నుంచి సన్నిధానానికి భక్తులను అనుమతించ లేదని సమాచారం. పంచగిరులు.. నీలిమల, కరిమల, శబరిమల, అప్పాచిమేడు, అలుదామేడు ప్రాంతాల్లో ఈ దివ్య జ్యోతి దర్శనం స్పష్టంగా కనిపించింది. దాంతో ఆయా ప్రాంతాలన్నీ భక్తులతో నిండిపోయాయి. శబరిమలలో సంక్రాంతి పండగ వేళ.. పంచగిరులపై మకరవిలక్కు (మకర జ్యోతి)గా అయ్యప్ప స్వామి వారు దర్శనమిస్తారని భక్తులు ప్రగాఢ విశ్వాసం. గత కొన్ని శతాబ్దాలుగా ఈ ఆచారం కొనసాగుతోంది. దాంతో లక్షలాది మంది భక్తులు శబరిమలకు మకర సంక్రాంతి వేళ.. తరలివస్తారు. మరోవైపు ఈ రోజు అంటే.. బుధవారం మధ్యాహ్నం 3.13 గంటల నుంచి మకర సంక్రాంతి పుణ్యకాలం ప్రారంభమైంది. దీంతో స్వామివారికి మేల్ శాంతుల పేరిట తంత్రిలు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ఇక జనవరి 12వ తేదీన పందళం రాజప్రసాదం నుంచి బయలుదేరిన స్వామివారి ఆభరణాలు ఈ రోజు సాయంత్రం 5.20 గంటలకు స్వామివారి సన్నిధికి చేరుకున్నాయి. వాటిని స్వామివారికి అలంకరించి.. మహదీపారాధన నిర్వహించారు. ఈ దీపారాధన అనంతరం పొన్నంబలమేడు కొండపై మకరజ్యోతి మూడుసార్లు దర్శనమిచ్చింది. అంటే సాయంత్రం 6.30 గంటల నుంచి 6.45 గంటల వరకు అంటే పావుగంట మధ్య మూడుసార్లు స్వామివారు దీప రూపంలో దర్శనమిచ్చారు. జనవరి 19వ తేదీ వరకు స్వామివారి దర్శనం కొనసాగనుంది. ఆ మరునాడు అంటే జనవరి 20వ తేదీ ఆలయాన్ని మూసివేయనున్నారు.

# అంతర్జాతీయ పండుగలా పొంగల్

మొదటి పేజీ తరువాయి...

జరిగిన పొంగల్ వేడుకల్లో ప్రధాని ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో పలువురు కేంద్ర మంత్రులు, బ్యూరోక్రాట్లు, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. పొంగల్ పండుగ మన జీవితానికి ఆనందకర అనుభవాన్ని ప్రసాదిస్తుందని మోదీ అన్నారు. అన్నదాతల శ్రమను గుర్తిస్తూ, ప్రకృతి మాతకు, పుడమి తల్లికి, సూర్య భగవానుడికి కృతజ్ఞతలు తెలుపుకునే అపురూప సందర్భం పొంగల్ అని ఆయన కొనియాడారు. ప్రకృతి, కుటుంబం, సమాజం మధ్య సమతూకాన్ని పాటించే బాటను ఈ పండుగ చూపిస్తుందన్నారు. నేల సారాన్ని కాపాడటం, జల పరిరక్షణ, భవిష్యత్ తరాల కోసం వనరుల సద్వినియోగం అవసరమని మోదీ తెలిపారు. ఈ విలువలను కాపాడేందుకే 'మిషన్ లైఫ్‌', 'ఏక్ పేడ్ మా కే నామ్‌', 'అమృత్ సరోవర్‌' లాంటి కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. పొంగల్ లాంటి పండుగల వల్లే 'ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్‌' స్ఫూర్తికి మరింత బలం చేకూరుతోందన్నారు.

**తమిళ సంస్కృతి యావత్ దేశ ఉమ్మడి సంస్కృతి**

'తమిళ సంస్కృతి కేవలం తమిళనాడుకు పరిమితం కాదు. ఇది యావత్ భారతదేశ ఉమ్మడి సంస్కృతి. ఇతర ప్రపంచ దేశాల్లోనూ దాని ఉనికి ఉంది. ప్రపంచ మానవత్వ వారసత్వంతోనూ తమిళ సంస్కృతికి అవినాభావ సంబంధం ఉంది. గతేడాది కూడా తమిళ సంస్కృతితో ముడిపడిన వివిధ కార్యక్రమాల్లో పాల్గొనే గొప్ప అవకాశం నాకు లభించింది. తమిళనాడులోని 1000 సంవత్సరాల ప్రాచీన గంగైకొండ చోళపురం ఆలయంలో నేను పూజలు నిర్వహించాను. ఉత్తరప్రదేశ్‌లోని వారణాసిలో నిర్వహించిన 'కాశీ తమిళ సంగమం' కార్యక్రమంలోనూ నేను భాగమయ్యాను. దేశ సాంస్కృతిక ఐకమత్యాన్ని బలోపేతం చేసేందుకు ఆ కార్యక్రమాన్ని నిర్వహించారు. పంబన్ వంతెనను ప్రారంభించడానికి రామేశ్వరానికి వెళ్లినప్పుడు మరోసారి నేను తమిళ చరిత్ర ఘనతకు సాక్షిగా నిలిచాను' అని ప్రధాని మోదీ పేర్కొన్నారు.

'దేశంలోని వివిధ ప్రాంతాల ప్రజలు పొంగల్‌తో పాటు లోహ్రీ, మకర సంక్రాంతి, మాఘ్ బిహు వంటి పండుగలను ఉత్సాహంగా జరుపుకుంటున్నారు. భారత్‌లోని, విదేశాల్లో ఉన్న తమిళ సోదరులు, సోదరీమణులకు నా తరఫున హృదయపూర్వక పొంగల్ శుభాకాంక్షలు. ఇదొక కుటుంబపరమైన పండుగ. వికాసం, కృతజ్ఞత, ఐకమత్యం అనే భావనలను కుటుంబాలు సంతోషంగా వ్యక్తపర్చడానికి పొంగల్ వేడుక సరైన సందర్భం' అని ప్రధాని మోదీ తెలిపారు.

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల ప్రజలకు మకర సంక్రాంతి శుభాకాంక్షలు తెలుపుతూ ఎక్స్ వేదికగా ప్రధాని మోదీ ఓ ట్వీట్ చేశారు. పంట చేతికొచ్చే సమయంలో జరిగే ఈ పండుగ భారతదేశ సాంస్కృతిక సుసంపన్నతను అద్దం పడుతుందన్నారు. దేశంలోని వివిధ ప్రాంతాల్లో విభిన్న రకాలుగా స్థానిక సంప్రదాయాలకు అనుగుణంగా సంక్రాంతి వేడుకలు జరుగుతాయని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరికీ సంతోషం, వికాసం, ఆరోగ్యాలను ప్రసాదించాలని ఈసందర్భంగా సూర్య భగవానుడిని తాను ప్రార్థిస్తున్నట్లు మోదీ తెలిపారు.

ఉత్తరాయణ పుణ్య కాలం వేళ జరిగే సంక్రాంతి వేడుక అందరిలో సామాజిక ఐక్యతా భావాన్ని పెంచాలని, వికాసానికి బాటలు వేయాలని ఆకాంక్షిస్తున్నట్లు చెప్పారు. భవిష్యత్తును సానుకూల దృక్పథం, ఆశావాదం, ఆత్మవిశ్వాసంతో చూడాలనే గొప్ప సందేశాన్ని సంక్రాంతి ఇస్తుందన్నారు. కాగా, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల ప్రజలకు స్థానిక భాషల్లో పొంగల్/సంక్రాంతి శుభాకాంక్షలను తెలుపుతూ ప్రత్యేక లేఖలను ప్రధాని మోదీ రాశారు. చాలామంది జీమెయిల్ ఖాతాలకు ఈ లేఖలు అందాయి.

పొంగల్ పండుగను తమిళనాడులో ఘనంగా జరుపుకుంటారు. ఈసందర్భంగా రాష్ట్రంలోని ప్రజలందరికీ పొంగల్ గిఫ్ట్ ప్యాక్‌లను డీఎంకే సర్కారు పంపిణీ చేస్తోంది. ఈ ప్యాక్‌లో 1 కేజీ ముడి బియ్యం, 1 కేజీ చక్కెర, 1 చెరకు గడ ఉంటాయి.

# రాజేంద్రనగర్, అత్తాపూర్ సర్కిళ్లలో ఘనంగా భోగి వేడుకలు



అత్తాపూర్ లక్ష్మీ హరన్ అపార్ట్ మెంట్ వద్ద భోగి మంటలు



బుద్వేల్ శ్రీ శివ సాయి కాలనీ లో భోగి మంటలు



హైదర్ గూడ రాహుల్ గ్రాండ్యూర్ అపార్ట్ మెంట్ వద్ద భోగి మంటలు



రాజేంద్రనగర్ లో బీజేపీ నాయకులు వై శ్రీధర్ నివాసంలో భోగి మంటలు

**బుద్వేల్, జనవరి 14 (ప్రభాత ఉదయం)**

రాజేంద్రనగర్, అత్తాపూర్ సర్కిళ్లలో బుధవారం భోగి వేడుకలు కన్నుల పండుగగా జరిగాయి. ఉదయాన్నే ఇళ్ళ ముందు భోగి మంటలు వేసుకున్నారు. హైదర్ గూడ రాహుల్ గ్రాండ్యూర్ అపార్ట్ మెంట్ లో చంద్రశేఖర్ రెడ్డి, వెంకట్రామి రెడ్డి, డీ టీ నాయక్ తదిరులు పాల్గొన్నారు.

అత్తాపూర్ లోభోగి మంటలు..

అత్తాపూర్ లక్ష్మీరాం హరన్ అపార్ట్మెంట్ ఆవరణలో బుధవారం భోగి మంటల కార్యక్రమం కన్నుల పండుగగా జరిగింది. ఈ కార్యక్రమంలో మహిళలు స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రాజేంద్రనగర్ లో...

రాజేంద్రనగర్ లో బీజేపీ రంగారెడ్డి జిల్లా నాయకులు వై శ్రీధర్ నివాసంలో భోగి మంటలు వేసి సంక్రాంతి సంబరాలు చేసుకున్నారు.

బుద్వేల్ లో గాలి పటాలను పంపిణీ చేసిన శ్రీ శ్రీనివాస సేవా సమితి అధ్యక్షుడు పెంద్యాల సాయి మల్లిక్ :

బుద్వేల్ లో శ్రీ శ్రీనివాస సేవా సమితి అధ్యక్షుడు పెంద్యాల సాయి మల్లిక్ ఆధ్వర్యంలో యువకులకు గాలి పటాలను పంపిణీ చేశారు.



బుద్వేల్ లో యువకులకు గాలి పటాలను పంపిణీ చేస్తున్న శ్రీ శ్రీనివాస సేవా సమితి అధ్యక్షుడు పెంద్యాల సాయి మల్లిక్



## విద్యుత్ గృహ జ్యోతి లబ్ధిదారులకు నూతన సంవత్సర, సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపిన అధికారులు

**రాజేంద్రనగర్, జనవరి14 (ప్రభాత ఉదయం)**

ప్రజా ప్రభుత్వం తీసుకున్న 6 గ్యారంటీ పథకాలో భాగమైన 200 యూనిట్లు ఉచిత విద్యుత్ గృహజ్యోతి పథకం లబ్ధిదారులకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి , విద్యుత్ శాఖ, ఫైనాన్స్ మంత్రి మల్లు భట్టి విక్రమార్క నూతన సంవత్సరం, సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు లేఖలను ప్రతి గృహజ్యోతి లబ్ధిదారులకు ఇంటింటికి తిరిగి స్థానిక విద్యుత్ శాఖ మీరాలం ఏడీఈ వెంకటేష్ గౌడ్, మీరాలం ఇంచార్జ్ ఏఈ బుచ్చిరెడ్డి, సిబ్బందితో కలిసి అందచేస్తున్నారు. మీరాలం ఏడీఈ పరిధి లోని చందూలాల్ బరాదారి సెక్షన్ ఏఈ పరిధిలో 4066 గృహజ్యోతి లబ్ధిదారులు సబ్సిడీ మొత్తం రూపాయలు 11లక్షలు, మీరాలం సెక్షన్ ఏఈ పరిధిలో 8666 గృహజ్యోతి స్కీమ్ లబ్ధిదారులు, సబ్సిడీ అమౌంట్ రూపాయలు 23.9 లక్షలు, కిషన బాగ్ సెక్షన్ ఏఈ పరిధిలో 5429 స్కీమ్ లబ్ధిదారులు, సబ్సిడీ అమౌంట్ రూపాయలు 17.67 లక్షలు, అత్తాపూర్ సెక్షన్ ఏఈ పరిధిలో 2807 స్కీమ్ లబ్ధిదారులు, సబ్సిడీ అమౌంట్ రూపాయలు 11.36 లక్షలు మొత్తగా మీరాలం ఏడీఈ పరిధి లోని 20,968 గృహజ్యోతి లబ్ధిదారుల సబ్సిడీ మొత్తం రూపాయలు 64 లక్షల వినియోగదారుల భారాన్నీ ప్రతి నెల ప్రభుత్వం చెల్లిస్తుంది. అలాగే ప్రతివారం మూడు రోజులు ఉదయాన్నే ప్రజాబాట కార్యక్రమం లో విద్యుత్ సరఫరా మెరుగు కోసం అధికారులు, సిబ్బందితో కలిసి సమస్యలను పరిష్కారం చేస్తున్నారు. ఇది విద్యుత్ సమస్యలపై ప్రభుత్వం ప్రజలకు వారధిగా పని చేస్తుందని మీరాలం ఏడీఈ వెంకటేష్ గౌడ్ తెలిపారు.



## ఘనంగా గోదారంగనాధుల కళ్యాణ మహోత్సవం..

**రాజేంద్రనగర్,జనవరి14(ప్రభాత ఉదయం)**

మైలార్ దేవ్ పల్లి డివిజన్ టీఎన్జవోస్ కాలనీ శ్రీవెంకన్నగుట్ట వెంకటేశ్వరస్వామి దేవాలయంలో గోదారంగనాధుల కళ్యాణ మహోత్సవం బుధవారం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా దేవాలయాన్ని వివిధ రకాల పూలు,రంగు రంగుల విద్యుత్ దీపాలతో అందంగా ముస్తాబు చేశారు. కళ్యాణ మహోత్సవంలో పాల్గొనే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా దేవాలయ కమిటీ సభ్యులు భారీ ఏర్పాట్లు చేశారు. భక్తులు తెల్లవారుజాము నుంచే దేవాలయానికి తరలివచ్చి స్వామి వారిని దర్శించుకోని కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.





## తెలుగు ప్రజలందరికి భోగి, సంక్రాంతి, మకర సంక్రాంతి శుభాకాంక్షలు

తెలంగాణ రాష్ట్ర ఎన్ ఎస్ యు ఐ నాయకుడు గొల్ల జాన్

ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ నాయకుడు వినయ్ ముదిరాజ్

## ప్రజల గొంతుక జర్నలిస్టులను అరెస్టు చేయడం సమంజసం కాదు

### రాజేంద్రనగర్ నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జి పట్లోళ్ల కార్తీక్ రెడ్డి

**రాజేంద్రనగర్,జనవరి14(ప్రభాత ఉదయం)**



ప్రజల గొంతుక జర్నలిస్టులను అరెస్టు చేయడం సమంజసం కాదని రాజేంద్రనగర్ నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జి పట్లోళ్ల కార్తీక్ రెడ్డిఅన్నారు. జర్నలిస్టులు,వార్త సంస్థ గాని నిరాధారమైన,అసత్య వార్త కథనాలు రాస్తే ఆ విషయంలో ఖండన కోరుకోవచ్చన్నారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ..జర్నలిస్టులను వివరణ కోరితే వారు స్పందించకపోతే చట్టపరమైన చర్యలు తీసుకోవచ్చు కానీ,ఇలా అర్ధరాత్రి ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా జర్నలిస్టులను అరెస్టు చేయడం సరైంది కాదన్నారు. ఎన్టీవీ జర్నలిస్టులు దొంతు రమేష్,పరిపూర్ణ చారి,సుధీర్ జర్నలిజంలో కొనసాగుతున్న సీనియర్ జర్నలిస్టులని,వీరి అరెస్టును ఖండిస్తున్నామన్నారు. అర్ధరాత్రి పూట తీవ్రవాదుల్లా అరెస్టు చేయడం ఎంత మాత్రం సమంజసం కాదన్నారు. వెంటనే ప్రభుత్వం అరెస్టు చేసిన జర్నలిస్టులను బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రజల గొంతుక జర్నలిస్టులను అరెస్టు చేయడం,నిర్బంధించడం కాంగ్రెస్ నిరంకుషత్వానికి నిదర్శనమన్నారు. ప్రజాస్వామిక పరిరక్షణ అంటూ కాంగ్రెస్ ఇచ్చిన ఏడవ గ్యారంటీ ఇదేనా అని కార్తీక్ రెడ్డి ప్రశ్నించారు. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే జర్నలిస్టుల గొంతును పోలీసు బలగాలతో నొక్కేసే కుట్ర అని ఆయన విమర్శించారు. ప్రజలను మభ్యపెట్టేందుకు వచ్చిన ఆరు గ్యారంటీలతో పాటు ప్రజాస్వామిక పరిరక్షణ పేరుతో ఇచ్చిన ఏడవ గ్యారెంటీ అంటే జర్నలిస్టులను అరెస్టు చేయడమేనన్నారు. బీఆర్ఎస్ పార్టీ ఎప్పుడూ జర్నలిస్టులకు అండగా ఉంటుందని కార్తీక్ రెడ్డి స్పష్టం చేశారు.



## రాజేంద్రనగర్‌లో ఘనంగా భోగి సంబరాలు..

### బండ్లగూడ భవాని కాలనీలో భోగిమంటలు జరుపుకున్న కాలనీవాసులు

**రాజేంద్రనగర్/బండ్లగూడ,జనవరి14(ప్రభాత ఉదయం)**


రాజేంద్రనగర్ సర్కిల్ వ్యాప్తంగా సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. మూడు రోజుల సంక్రాంతి పండుగలో తొలిరోజు భోగి సంబరాలు వైభవంగా జరిగాయి. బుధవారం తెల్లవారుజామున ఇంటి ముంగిళ్లలో భోగి సంబరాలు ఘనంగా నిర్వహించారు. భోగి మంటలు వేసుకుంటూ ఆటపాటలతో ఉత్సాహంగా గడిపారు. ఇంటి ముంగిట రంగురంగుల ముగ్గులను వేశారు. అందులో గొబ్బెమ్మలు పెట్టి, నవధాన్యాలు వేసి మొక్కులు తీర్చుకున్నారు. హైదర్ గూడ రాహుల్ గ్రాండ్యూర్ అపార్ట్మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సంక్రాంతి పండుగ సందర్భంగా భోగి మంటలు, భోగి పండుగను సంప్రదాయబద్ధంగా ఘనంగా నిర్వహించారు. బాబుల్ రెడ్డి నగర్,రాజేంద్రనగర్, భవానికాలనీ,కాటేదాన్, ప్రాంతాలలో భోగి మంటలు వేసి సంబరాలు జరుపుకున్నారు. బండ్లగూడ డివిజన్ పరిధిలో గల భవాని కాలనీలో కాలనీవాసులు సంక్రాంతి పండుగ సందర్భంగా భోగి మంటలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాలనీ పెద్దలు, మహిళలు, పిల్లలు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను మరింత ఉత్సాహంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా కాలనీ పెద్దలు మాట్లాడుతూ...సాంస్కృతి సాంప్రదాయాలు ప్రతి ఒక్కరు తెలిసేలా సంక్రాంతి వేడుకలు జరుపుకోవాలని సూచించారు. పెద్దలు పిల్లలకు భోగి పండుగ విశిష్టతను వివరించారు.



## ముఖ్యమంత్రి సహాయ నిధి నిరుపేదలకు ఓ వరం

### లబ్ధిదారునికి ఎల్ఓసి పత్రాన్ని అందజేసిన బండి రమేష్

**కూకట్ పల్లి, జనవరి 14 (ప్రభాత ఉదయం)**





కూకట్ పల్లి నియోజకవర్గం, ఫతేనగర్ డివిజన్ కు చెందిన మచ్చ నరేష్ తండ్రి మచ్చ బాలమైసయ్య (32) బ్రెయిన్ స్ట్రోక్ వలన పెరిలాసిస్ రావడం తో నిమ్స్ హాస్పిటల్ లో చేరారు. వారి సోదరుడు సురేష్ కూకట్ పల్లి లోని గొట్టుముక్కల వెంకటేశ్వర రావు కార్యాలయంలో సంప్రదించగా వెంటనే వెంకటేశ్వరరావు బండి రమేష్ ద్వారా ముఖ్యమంత్రి సహాయనిది కి దరఖాస్తు చేయించారు. ప్రభుత్వ పెద్దల సహకారంతో వారికి ఎల్ ఓ సి ద్వారా రూ. 1.50 వేల రూపాయలు మంజూర్ చేయించారు. ఆ మంజూర పత్రాన్ని కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో టిపిసిసి ఉపాధ్యక్షులు, కూకట్ పల్లి నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి బండి రమేష్ చేతుల మీదుగా వారి భార్య సౌజన్య, తల్లి ముత్తమ్మ కు అందజేశారు. ఈ సందర్భంగా వారి భార్య, తల్లి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, బండి రమేష్ కి, గొట్టుముక్కల వెంకటేశ్వర రావుకు కృతజ్ఞతలు తెలియజేశారు.

## 21 కిలోల గంజాయి స్వాధీనం

### కూకట్‌పల్లి పోలీసుల చాకచక్యమైన ఆపరేషన్

**కూకట్ పల్లి,జనవరి 14 (ప్రభాత ఉదయం)**



కూకట్ పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో మాదక ద్రవ్యాల అక్రమ రవాణాపై పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి 21 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ కొండలరావు తెలిపారు. మంగళవారం రాత్రి ఒడిశా రాష్ట్రం నుండి మహారాష్ట్ర నుండి పూణేకు గంజాయి తరలిస్తున్నారన్న పక్కా సమాచారం అందిన నేపథ్యంలో, కూకట్ పల్లి జోన్ పోలీసు కమిషనర్ రితిరాజ్ ఆదేశాలతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బాలానగర్ సహాయ పోలీసు కమిషనర్ నరేష్ రెడ్డి మార్గదర్శకత్వంలో, కూకట్ పల్లి పోలీస్ స్టేషన్ అధికారి సుబ్బారావు పర్యవేక్షణలో డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ కొండలరావు, మాదక ద్రవ్యాల నియంత్రణ విభాగం ఇన్‌స్పెక్టర్ రవి, అధికారి నర్సింహులు సంయుక్తంగా ఈ ఆపరేషన్ నిర్వహించినట్లు తెలిపారు. ఈ క్రమంలో మహారాష్ట్ర రాష్ట్రం పూణేకు చెందిన ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకొని, వారి వద్ద నుండి ఇరవై ఒక్క కిలోల మూడు వందల యాభై గ్రాముల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. విచారణలో వారు ఒడిశా రాష్ట్రంలోని బరంపూర్ ప్రాంతం నుండి గంజాయిని పూణేకు అక్రమంగా తరలిస్తున్నారని, వారి వద్ద నుండి ఒక మొబైల్ ఫోన్‌ను కూడా స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. సమాచారం అందించిన వ్యక్తులను, అలాగే ఈ ఆపరేషన్‌లో పాల్గొన్న పోలీసు అధికారులను ఉన్నతాధికారులు అభినందించినట్లు డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ కొండలరావు తెలిపారు.

# సంక్రాంతి సందడి.. కళకళలాడుతున్న పల్లెలు








**గద్వాల జిల్లా ప్రతినిధి, జనవరి 14 (ప్రభాత ఉదయం)**

జోగులాంబ గద్వాల జిల్లాలో సంక్రాంతి పండుగ సందడి నెలకొంది. పట్టణాలు, వివిధ ప్రాంతాల నుంచి సొంతూళ్లకు వచ్చిన వారితో పల్లెలు కళకళలాడుతున్నాయి. బుధవారం భోగి పర్వదినాన్ని ప్రజలు వైభవంగా జరుపుకున్నారు. భోగి మంటలు వేసి పాటలు, కోలాటాలతో ఉత్సాహంగా గడిపారు. పల్లె, పట్టణం అనే తేడా లేకుండా మహిళలు, యువతులు ఉదయమే లేచి ఇళ్ల ముందు వివిధ రంగులతో పండుగ ప్రాశస్త్యాన్ని తెలిపేలా ముత్యాల ముగ్గులను ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. గొబ్బెమ్మలు, నవ ధాన్యలతో అందంగా అలంకరించారు. ఘుమఘుమలాడే పలు రకాల పిండి వంటలను తయారుచేశారు. అబశ్రీశ్రీగంగిరెద్దుల విన్యాసాలు, హరిదాసుల కీర్తనలు ఆకట్టుకున్నాయి. చిన్న, పెద్ద తేడా లేకుండా ఇళ్లపైన, ఖాళీ ప్రదేశాలు, పంట పొలాల్లో పతంగులు ఎగురవేస్తూ సంబురంగా గడిపారు. వివిధ రంగులు, ఆకృతుల్లో గాలిపటాలు ఆకాశంలో హరివిల్లులా దర్శనమిచ్చాయి. కాగా, గురువారంఅబశ్రీశ్రీ మకర సంక్రాంతి, శుక్రవారం కనుమ పండుగలు జరుపుకునేందుకు ప్రజలు సర్వం సిద్ధం చేసుకున్నారు.







# కొత్తకోట మున్సిపాలిటీలో 17 కోట్ల రూపాయల నిధులతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

**కొత్త కోట,జనవరి 14 (ప్రభాత ఉదయం)**

కొత్తకోట మున్సిపాలిటీ లో 17 కోట్ల రూపాయల నిధులతో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే జిఎంఆర్ తో కలిసి మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, వాకిటి శ్రీహరి లు శ్రీకారం చుట్టారు. పట్టణంలో6 కోట్ల రూపాయల నిధులతో సిసి రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి,2 కోట్ల రూపాయల నిధులతో పార్కుల డెవలప్మెంట్, తదితర నిర్మాణాలకు , 1 కోటి, 50 లక్షల నిధులతో స్ట్రోమ్ వాటర్, డ్రైన్ల నిర్మాణానికి , 5 కోట్ల నిధులతో డెవలప్మెంట్ ఆఫ్ చేనగ చెరువు పనులకు,50 లక్షల నిధులతో డెవలప్మెంట్ ఆఫ్ మీడియన్ ప్లాంటేషన్ పనులకు,2 కోట్ల రూపాయల నిధులతో మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం నిర్మాణ పనులకు రోడ్లు భవనాల శాఖ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి , పశు సంవర్ధక, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి , దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి శంకుస్థాపన చేశారు .ఈ సందర్భంగా కొత్తకోట పట్టణానికి విచ్చేసిన మంత్రి, ఎమ్మెల్యే కి ఘన స్వాగతం పలికిన కొత్తకోట మున్సిపాలిటీ, మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువకులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ భూముల్ని రక్షించాలి

**మాజీ జెడ్పిటిసి శ్రీనివాసరావు ఇంటిని స్వాధీనం చేసుకోవాలి**

**కారాజ్ ఖాతా భూమిని ఆక్రమించిన రాఘవరావు**

**ఇనాం భూమిని బినామీ పేరుతో పట్టా పొందిన యాకాంతరావు**

**పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి**

**సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ డిమాండ్**

**జనగామ జిల్లా ప్రతినిధి, జనవరి 14(ప్రభాత ఉదయం):**

కోట్ల విలువైన ప్రభుత్వ భూముల్ని కాపాడాలని వాటిని ప్రజా అవసరాలకు ఉపయోగించాలని సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. బుధవారం నియోజకవర్గ కేంద్రంలోని శ్రీ సోమేశ్వర ఫంక్షన్ హాల్ లో ఆ పార్టీ విలేకరుల సమావేశాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర కార్యదర్శి మామిండ్ల రమేష్ రాజా, రాష్ట్ర కమిటీ సభ్యులు, జిల్లా కార్యదర్శి గుమ్మడి రాజుల సాంబయ్య, రాష్ట్ర కమిటీ సభ్యురాలు అనంతోజ రజిత పాల్గొని మాట్లాడారు. పాలకుర్తిలో ప్రభుత్వ అసైన్డ్, ఇనాం, కాందిశీకుల భూములు అన్యాక్రాంతం అయ్యాయని, కాంగ్రెస్, బిఆర్ఎస్ అనే పార్టీ తేడా లేకుండా ఆక్రమించారని విమర్శించారు. అక్రమంగా ఆక్రమించిన ఆస్తులను కాపాడుకునేందుకు పార్టీలు మారుతున్నారని, అధికార పార్టీలో చేరుతున్నారని వారు అన్నారు. మాజీ జెడ్పిటిసి పుష్కూరి శ్రీనివాసరావు ప్రభుత్వ స్థలంలో ఇల్లు కట్టారని, దానిని స్వాధీనం చేసుకొని ప్రజల అవసరాలకు ఉపయోగించాలని డిమాండ్ చేశారు. కాందీశీకుల భూమి కబ్జాకు గురవుతుందని దానిని పరిరక్షించాలని వారు అన్నారు. విస్నూర్లో ఎర్రబెల్లి రాఘవరావు ఖరాజ్ ఖాతా భూమిని కబ్జా చేశారని, పాలకుర్తిలో ఇనామ్ భూమిని మాజీ సర్పంచ్ వీరమనేని యాకాంతరావు బినామీ పేరుతో పట్టా పొందాడని ఆరోపించారు. పార్టీలు వేరైనప్పటికీ ప్రభుత్వ ఆస్తుల్ని, ప్రజల ఆస్తుల్ని దోపిడీ చేయడంలో అధికార, ప్రతిపక్ష పార్టీలు పోటీ పడుతున్నాయని, దొంగ నాటకాలు ఆడుతున్నారని, ప్రజల్ని తప్పుదోవ పట్టిస్తున్నారని తీవ్రంగా విమర్శించారు. స్వప్రయోజనాల కోసమే పనిచేస్తున్నారని వారికి ప్రజా అవసరాలు పట్టడం లేదని అన్నారు. అధికారులు రాజకీయ పార్టీల నేతల వొత్తిళ్లకు గురికాకుండా ప్రజల ఆస్తుల్ని ప్రభుత్వ ఆస్తుల్ని కాపాడాలని, హైడ్రా తరహాలో ఫైడ్రా తీసుకురావాలని అన్నారు. పాలకుర్తిలో 1100 మంది నిరుపేదలు ఉన్నారని వారందరికీ ఇళ్లస్థలాలు ఇప్పించి అధికార, ప్రతిపక్ష నాయకులు తమ చిత్తశుద్ధి నిరూపించుకోవాలన్నారు. పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి కజ్జా దారులకు అండగా ఉండకూడదని, ప్రజా ప్రయోజనాల లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాల కోసం, క్రీడా మైదానం కోసం ఇతర ప్రజా అవసరాల కోసం ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకొని వినియోగించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా కమిటీ సభ్యులు జీడి సోమయ్య, మండల కార్యదర్శి కొనకటి కళింగరాజు, నాయకులు తూర్పాటి సారయ్య, గాయాల బాబు, యువజన సంఘం జిల్లా నాయకులు పెద్ది రాహుల్, తదితరులు పాల్గొన్నారు





## గ్రామీణ యువత క్రీడల్లో రాణించాలి

**ఉప్పేర్ ప్రీమియర్ లీగ్ విజేతలకు బహుతులు అందజేత**

**ధరూర్, జనవరి 14 (ప్రభాత ఉదయం)**

గ్రామీణ యువత క్రీడల్లో రాణించాలని ఉప్పేర్ గ్రామ సర్పంచ్ మహేశ్వరమ్మ భాస్కర్ రెడ్డి, నాయకులు హనుమంతు రెడ్డి, కాంగ్రెస్ పార్టీ యూత్ మండలాధ్యక్షుడు సమీర్ ముఖాహిద్ అన్నారు. బుధవారం ధరూర్ మండలం ఉప్పేర్ గ్రామంలో నిర్వహిస్తున్న ఉప్పేర్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు స్థానిక నాయకులతో కలిసి వారు బహుమతులు అందజేశారు. ఉప్పేర్ ప్రీమియర్ క్రికెట్ లీగ్ లో మొత్తం 12 టీమ్ లు పాల్గొన్నగా ఫైనల్లో యూసుప్ వారియర్స్, వివేక్ వారియర్స్ జట్లు తలపడాయి. టోర్నమెంట్ విజేతగా యూసుప్ వారియర్స్ జట్టు విజేతగా నిలిచింది. విన్నర్ జట్టుకు కాంగ్రెస్ పార్టీ మండల యూత్ అధ్యక్షుడు సమీర్ ముజాహిద్ రూ.10,116 నగదు ప్రోత్సాహాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... క్రీడలలో గెలుపోటములు సహజమని, సంక్రాంతి సెలవుల్లో క్రికెట్ పోటీలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. ఎలాంటి సహాయ సహకారాలు కావాలన్న అండగా ఉంటామని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ గద్వాల నర్సమ్మ, వార్డు మెంబర్ వసీం, క్రికెట్ టోర్నమెంట్ నిర్వాహకులు పాల్గొన్నారు.




ట్రాఫిక్ సిగ్నల్స్ ముగ్గులు

## రవాణా శాఖ ఆధ్వర్యంలో రోడ్డు భద్రత రంగవల్లులు

**జనగామ జిల్లా ప్రతినిధి, జనవరి 14(ప్రభాత ఉదయం):**

జాతీయ రోడ్డు భద్రత మాస ఉత్సవాలలో భాగంగా జనగామ రవాణా శాఖ ఆధ్వర్యంలో రంగవల్లుల ప్రోగ్రాం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళలు పాల్గొని రోడ్డు భద్రత సంబంధించిన రంగవల్లులు ప్రదర్శించినారు. ఈ కార్యక్రమంలో రవాణా శాఖ అధికారులు, కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఇలా పట్టుకుని... అలా వదిలేశారంటా

**సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వీడియో**

**పట్టుకుని వదిలేసిన వాహనం ఎవరిది??**

**పోలీస్ స్టేషన్ కు తరలించిన కొన్ని గంటలకే విడిచి పెట్టిన వైనం**

**గద్వాల జిల్లా ప్రతినిధి, జనవరి 14(ప్రభాత ఉదయం)**

గద్వాల జిల్లాలో రేషన్ బియ్యం అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. గద్వాల నియోజకవర్గంలో ఓ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం అర్ధరాత్రి రేషన్ బియ్యంను అక్రమంగా తరలిస్తున్న ఓ వాహనాన్ని సంబంధిత అధికారులు పట్టుకుని, ఆ తరువాత కొద్ది సేపటికి వదిలేసినట్లు సోషల్ మీడియాలో ఓ పోస్టు వైరల్ అవుతోంది. అక్రమార్కులకు అధికార పార్టీ నాయకులు అండనా లేక ఆర్థిక లావాదేవీలు కారణమా అనే అంశంపై కూడా చర్చించుకుంటున్నారు. పట్టుబడింది రేషన్ బియ్యం వాహనమేనా మరేదైన వాహనమా అన్న విషయంలో స్పష్టత లేకపోయినప్పటికీ అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం తరలిస్తున్న వాహాన్నాన్ని పట్టుకుని.. వదిలేసిన ఘటన వాస్తవమని చర్చించుకుంటున్నారు. అది ఆ నోట, ఈ నోట పడి సోషల్ మీడియాలో వైరల్ అయింది. రేషన్ స్మగ్లర్లుకు సంబంధించిన గ్రూపులతో పాటు ఆ మండలంలోని పలు వాట్సప్ గ్రూప్ లలో ఆ విషయం వైరల్‌గా మా రినట్లు విశ్వసనీయ సమాచారం. ఇదిలా ఉంటే పట్టుబడ్డ రేషన్ బియ్యం వాహనం అక్రమార్కులు తరలించే క్రమంలో పట్టుబడినట్లు కొందరు రేషన్ స్మగ్లర్లుకు తెలిసినప్పటికి వారు మౌనంగా ఉన్నట్లు తెలిసింది. గద్వాల నుంచి రాయచూర్‌కు రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న క్రమంలో రేషన్ బియ్యం వాహనాన్ని పట్టుకోవడం జరిగిందని, పోలీసులకు సమాచారం ఇచ్చిన ఇన్ఫార్మర్లు బహిరంగానే చెప్పుకుంటున్నారు. నిత్యం గద్వాల నుంచి రాయచూర్ కు పీడిఎస్ బియ్యం తరలిపోతున్నట్లు రేషన్ స్మగ్లర్లే సమాచారం ఇచ్చి పట్టిస్తుండటం కొసమెరుపు. దీనిపై సంబంధిత అధికారులను వివరణ కోరేందుకు సంప్రదించగా ఎవరు అందుబాటులోకి రాలేదు.

# సంక్రాంతి కళకళ

**తెలుగు వారి అతి పెద్ద పండుగలలో సంక్రాంతికి ఒక విశిష్టమైన స్థానం ఉంది. దీనిని 'పెద్ద పండుగ' అని ఎంతో భక్తిశ్రద్ధలతో, ఉత్సాహంగా జరుపుకుంటారు. సూర్యుడు ధనూరాశి నుంచి మకరరాశిలోకి ప్రవేశించే పుణ్యకాలాన్నే 'మకర సంక్రాంతి' అంటారు. ఈ రోజు నుంచే సూర్యుడు తన దిశను మార్చుకుని ఉత్తర దిశగా ప్రయాణిస్తాడు, దీనినే 'ఉత్తరాయణ పుణ్యకాలం' అని పిలుస్తారు. ఈ పండుగ కేవలం ఒక వేడుక మాత్రమే కాదు, ప్రకృతితో మనిషికి ఉన్న విడదీయలేని అనుబంధాన్ని, కృతజ్ఞతా భావాన్ని గుర్తుచేసే గొప్ప సందర్భం. ముఖ్యంగా రైతులకు ఇది పంట చేతికి వచ్చే సమయం కావడంతో, పల్లెల్లో ఎనలేని సంబరం కనిపిస్తుంది. ధాన్యపు రాశులు ఇంటికి చేరడంతో లక్ష్మీదేవి తమ ఇంట కొలువుదీరిందని రైతులు ఆనందపడతారు. అందుకే ఈ పండుగ గ్రామీణ ప్రాంతాల్లో కొత్త శోభను సంతరించుకుని కళకళ లాడుతుంటుంది.**



సంక్రాంతి శోభ ఇంటి ముంగిట వేసే రంగురంగుల ముగ్గులు మరియు గొబ్బెమ్మలతో ప్రారంభమవుతుంది. ధనుర్మాసం అంతా తెల్లవారుజామునే లేచి ముగ్గులు వేసి, వాటి మధ్యలో ఆవు పేడతో చేసిన గొబ్బెమ్మలను ఉంచి, పసుపు కుంకుమలు, పూలతో అలంకరిస్తారు. హరిదాసుల కీర్తనలు పల్లెల్లో ప్రతిధ్వనిస్తుంటాయి. 'అక్షయం అని పలకండి' అంటూ వచ్చే హరిదాసు, తల మీద చిందులు తొక్కే గంగిరెద్దులు, బుడబుక్కల వారి విన్యాసాలు పండుగ వాతావరణాన్ని మరింత రంజింపజేస్తాయి. ఇంటికి వచ్చే కొత్త అల్లుళ్లు, బంధుమిత్రుల రాకతో ఇళ్లన్నీ సందడిగా మారుతాయి. ఆడపడుచులు కొత్త బట్టలు కట్టుకుని పరమాన్నం వండుతూ ఉంటే, చిన్నపిల్లలు గాలిపటాలు ఎగరేస్తూ పోటీ పడుతుంటారు. ఆకాశమంతా రంగురంగుల గాలిపటాలతో నిండిపోయి చూడముచ్చటగా ఉంటుంది. కొన్ని ప్రాంతాల్లో కోడి పందాలు, ఎడ్ల బండ్లు పరుగు పందాలు వంటి వినోద కార్యక్రమాలు ఈ పండుగలో అంతర్భాగంగా ఉండి పౌరుషానికి, సరదాకి వేదికవుతాయి.

మకర సంక్రాంతి ఆధ్యాత్మికంగా కూడా ఎంతో ప్రాముఖ్యతను కలిగి ఉంది. పురాణాల ప్రకారం ఉత్తరాయణం దేవతలకు పగలు అని, ఈ సమయంలో మరణించిన వారు నేరుగా మోక్షాన్ని పొందుతారని నమ్ముతారు. అందుకే భీష్మ పితామహుడు అంపశయ్యపై ఉండి కూడా తన ప్రాణాన్ని వదలడానికి ఈ పుణ్యకాలం కోసం వేచి చూశారు. ఈ రోజున పవిత్ర నదులలో స్నానం చేయడం, పితృదేవతలకు తర్పణాలు విడవడం ఒక సంప్రదాయంగా వస్తోంది. దానధర్మాలు చేయడం వల్ల పుణ్యం లభిస్తుందని నమ్మి, పేదలకు అన్నదానం, వస్త్రదానం చేస్తారు. ఆహారపరంగా చూస్తే, నువ్వులు మరియు బెల్లం కలిపి తినడం వెనుక శాస్త్రీయ కారణం ఉంది. శీతాకాలంలో చల్లబడిన శరీరానికి నువ్వులు అవసరమైన వేడిని, శక్తిని అందిస్తాయి. తీపి మరియు నువ్వుల మిశ్రమం ద్వారా మనుషుల మధ్య సంబంధాలు కూడా తీయగా ఉండాలని దీని వెనుక ఉన్న అంతరార్థం.

మూడు రోజుల పాటు జరుపుకునే ఈ పండుగలో ప్రతి రోజుకు ఒక ప్రత్యేకత ఉంది. మొదటి రోజు 'భోగి' నాడు పాత సామాన్లను మంటల్లో వేసి అంతర్గత మాలిన్యాలను వదిలేయాలని సంకేతిస్తారు. రెండో రోజు 'సంక్రాంతి' ప్రధాన పండుగ. మూడో రోజు 'కనుమ' నాడు వ్యవసాయంలో తమకు తోడుగా ఉన్న పశువులను పూజిస్తారు. పశువులను శుభ్రం చేసి, రంగులు పూసి, గంటలతో అలంకరించి వాటి పట్ల కృతజ్ఞత చాటుకుంటారు. ఇలా సంక్రాంతి పండుగ మానవులకు, జంతువులకు మరియు ప్రకృతికి మధ్య ఉన్న బంధాన్ని బలపరుస్తుంది. పంట చేతికొచ్చిన ఆనందంలో రైతు చేసే వేడుక ఇది. ఈ పండుగ సంస్కృతిని కాపాడుకోవడమే కాకుండా, రాబోయే తరాలకు మన సాంప్రదాయాల గొప్పతనాన్ని చాటిచెబుతుంది. సూర్యుడి గమనం మారినట్లే, మన జీవితాల్లో కూడా చీకటి తొలగి వెలుగులు నిండాలని ఆకాంక్షించే ఈ పండుగ శోభ ప్రతి ఏటా మన హృదయాల్లో కొత్త ఆశలను, ఉత్సాహాన్ని నింపుతుంది.

# సంక్రాంత్రి ముగ్గులతో మహిళలు అందరినీ అబ్బురపరిచారు

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి ( కాప్రా డివిజన్ ) జనవరి 14 ( ప్రభాత ఉదయం)**

సంక్రాంతి ముగ్గులతో మహిళలు అందరిని అబ్బురపరిచారని కాంగ్రెస్ పార్టీ ఉప్పల్ నియోజకవర్గ ఇన్చార్జి మందముల పరమేశ్వర్ రెడ్డి అన్నారు. బుధవారం సైంటిఫిక్ రీసెర్చ్ అండ్ కమ్యూనిటీ సంస్థ ఉద్యోగులకు (రంగోలి) ముగ్గుల పోటీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కాంగ్రెస్ పార్టీ ఉప్పల్ నియోజకవర్గ ఇన్చార్జ్ మందముల పరమేశ్వర్ రెడ్డి పాల్గొని ఉద్యోగులు వేసిన ముగ్గులను తిలకించారు. ఈ సందర్భంగా ఆయన సంక్రాంతి ముగ్గులతో మహిళలు అందరిని అబ్బురపరిచారని అన్నారు. తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలు ప్రతిబింబించే తీరుగా తీరొక రంగులతో ముగ్గులు వేసి అందరినీ ఆకట్టుకున్నారని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళలు అన్ని రంగాల్లో రాణించేందుకు ఎన్నో రకాల సంక్షేమ పథకాలను అందిస్తోందని ఆయన తెలిపారు. అనంతరం రంగోలి పోటీలో



ఎస్ ఆర్ సి ఉద్యోగులకు బహుమతులను అందించిన పరమేశ్వర్ రెడ్డి

విజేతలుగా అందించిన మహిళలకు కాంగ్రెస్ పార్టీ ఉప్పల్ నియోజకవర్గ ఇన్చార్జ్ మందముల పరమేశ్వర్ రెడ్డి చేతుల మీదుగా బహుమతులను ప్రధానం చేశారు. సీనియర్ కాంగ్రెస్ నాయకులు- యువ కాంగ్రెస్ నాయకులు ఎస్ ఆర్ సి సంస్థ యజమాని తన్నీరు శ్రీహరి చిన్నవయసులో పారిశ్రమీకవేత్తగా ఎదిగి ఉపాధి కల్పిస్తూ, రాజకీయ నాయకునిగా సామాజిక సేవలలో చురుకుగా పాల్గొంటూ యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారని అన్నారు. వారి సేవలు కొనసాగించాలని, ఎస్ ఆర్ సి సంస్థ ఉద్యోగులకు ఆయన సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమం లో ఎస్ ఆర్ సి సంస్థ యజమాని తన్నీరు శ్రీహరి, మేనేజర్ రాము, కాప్రా డివిజన్ కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణి, మేడ్చల్ జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ విఠల్ నాయక్, కాప్రా డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు కొబ్బనూరి నాగశేషు, మేడ్చల్ జిల్లా ఏఎంసి డైరెక్టర్ పూర్ణయాదవ్, మాజీ డైరెక్టర్ కొబ్బనూరి నాగరాజు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు గడ్డం యాదగిరి, టిల్లు యాదవ్, మల్లికార్జున్, కె ఎల్ రావ్, పడమటి మల్లారెడ్డి, పొట్టు బాబురావ్, నరేందర్ గౌడ్, శ్రీధర్ రెడ్డి, ఉప్పల వినోద్, రాకేష్ యాదవ్, జగదీష్, తోటకూర శ్రీకాంత్, మూర్తుజా, నాగరాజు యాదవ్ సతీష్ యాదవ్, సాయి యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

# రజక సంఘం ఆధ్వర్యంలో నూతన సర్పంచులకు సన్మానం



**ఆదిలాబాద్ జిల్లా ప్రతినిధి, జనవరి 14 ( ప్రభాత ఉదయం)**

జిల్లా లోని తలమడుగు మండలం రూయ్యాడి గ్రామంలో గ్రామ రజక సంఘం ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. నూతనంగా ఎన్నికైన సర్పంచ్ ఉడుగు రాకేష్. ఉప సర్పంచ్ వెంకటేష్ యాదవ్. వార్డ్ సభ్యులు ఎన్ అశోక్.ా రమాకాంత్. ఉత్తం లను సన్మానించినారు .ఈ సందర్భంగా మాజీ జడ్పిటిసి గోక గణేష్ రెడ్డి మాట్లాడుతూ రజకులు విశ్వాసానికి.నమ్మకానికి మారుపేరని. ఈ గ్రామామనికి పూర్వం రజకుల గ్రామముగా పేరు ప్రతిష్టలు ఉండేవని అప్పటికి ఇప్పటికి గ్రామ అభివృద్ధిలో వారు సహకారం అందిస్తున్నారని గ్రామంలో 15 లక్షలతో రజక సంఘ భవనాన్ని నిర్మిస్తామని. పది ఇందిరమ్మ ఇల్లు రజకులకు నిర్మిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం గౌరవ అధ్యక్షుడు ఎల్చాలా అయ్యన్న. మాజీ సర్పంచ్ పీ పోతారెడ్డి. సంజీవరెడ్డి. కాంగ్రెస్ నాయకులు మల్లేష్ యాదవ్. టి గంగారెడ్డి. రజక కుటుంబా సభ్యులు పాల్గొన్నారు



# కర్నాటకలోనూ చైనా మంజా పంజా

**బైక్‌పై వెళుతుండగా చుట్టుకున్న మంజా**

**తీవ్ర రక్త స్రావంతో అక్కడిక్కడే మృతి**

**బెంగళూరు, (ప్రభాత ఉదయం):**

చైనా మాంజా యమ పాశంగా మారి దేశవ్యాప్తంగా అనేక మందిని బలి తీసుకుంటోంది. తాజాగా కర్ణాటకకు చెందిన ఓ బైకర్ ఈ మాంజా కారణంగా దుర్మరణం చెందారు. బీదర్ జిల్లా తలమడగి వంతెన సమీపంలో ఈ ఘటన జరిగింది. బాధితుడిని సంజు కుమార్ హళసమణిగా గుర్తించారు. హళసమణి బైక్ డ్రైవ్ చేసుకుంటూ వెళుతున్న సమయంలో ఈ ప్రమాదం జరిగింది. ఆయన మెడకు మాంజా చుట్టుకోవడంతో కోసుకుపోయి గాయాలయ్యాయి. తీవ్ర రక్తస్రావమైంది. ఆయన తన కూతురికి ఫోన్ చేసి సమాచారం అందించే ప్రయత్నంలో ఉండగానే కుప్పకూలిపోయారు. చుట్టుపక్కల వారు గాయాలకు కర్చీఫ్‌లను అడ్డుపెట్టి రక్తస్రావాన్ని ఆపే ప్రయత్నం చేశారు. మరికొందరు అంబులెన్స్‌ను పిలిపించారు. అయితే, బాధితుడిని ఆసుపత్రికి తరలించే క్రమంలోనే కన్నుమూశారు. హళసమణి మృతికి అధికారుల నిర్లక్ష్యమే కారణమని ఆయన కుటుంబసభ్యులు ఆరోపించారు. అంబులెన్స్ సకాలంలో వచ్చి ఉంటే ఆయన ప్రాణాలతోనే ఉండి ఉండేవారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ జాప్యమే ఆయన ప్రాణాలను తీసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఘటన జరిగిన ప్రాంతంలో మృతుడి బంధువులు, స్థానికులు ధర్నాకు దిగారు. ఎమ్జ్గ్ర÷న్సీ సర్వీసులను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చైనా మాంజాపై నిషేధాన్ని పూర్తి స్థాయిలో అమలు చేయాలని కోరారు. ఇక ఈ ఘటనపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. దర్యాప్తు ప్రారంభించామని పోలీసులు తెలిపారు. మకర సంక్రాంతిని పురస్కరించుకుని దేశవ్యాప్తంగా గాలిపటాలను ఎగురవేయడం సంప్రదాయంగా వస్తున్న విషయం తెలిసిందే. అయితే, గాలిపటాల కోసం సాధారణ మాంజాలకు బదులుగా కొందరు చైనా మాంజాలను వినియోగించడంతో ప్రమాదాలు ఎదురవుతున్నాయి. విద్యుత్ స్తంభాలు, వైర్ల నుంచి వేళ్లాడే మాంజాలు వాహనదారులకు చుట్టుకుని ప్రమాదాలకు కారణమవుతున్నాయి. ముఖ్యంగా టూవీలర్స్‌పై ప్రయాణించే వారికి ఇవి యమ పాశాలుగా మారుతున్నాయి.

# ఉరితాళ్లుగా చైనా మాంజా

**బైకర్ మెడకు తగిలి కోసుకున్న మెడ**

**తీవ్రగాయంతో మృతి చెందిన వ్యక్తి**

**సంగారెడ్డి, (ప్రభాత ఉదయం):**



సంగారెడ్డి మండలం పసల్వాడి గ్రామంలో భయానక ఘటన చోటుచేసుకుంది. చైనా మాంజా మెడకు తగిలి గొంతు కోసుకుపోవడంతో ఓ ద్విచక్రవాహనదారుడు ప్రాణాలు కోల్పోయాడు. మృతుడిని బిహార్ కి చెందిన అద్వైక్‌గా గుర్తించారు పోలీసులు. కొంతకాలంగా అతడు పసల్వాడిలోని ఓ పరిశ్రమలో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. బుధవారం అతను బైక్‌పై వెళ్తుండగా చైనా మాంజా రోడ్డుకు అడ్డంగా వెళాడుతోంది. అది కంటికి కనిపించకపోవడంతో ఒక్కసారిగా అతని గొంతుకు చుట్టుకుని కోసేసింది. ఈ ప్రమాదంలో తీవ్ర రక్తస్రావంతో బాధితుడు ప్రాణాలు కోల్పోయాడు. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే అతడిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించినా ఫలితం లేకుండా పోయింది. మాంజా గొంతుకు లోతుగా కోసుకోవడంతో అద్వైక్ మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ ఘటనతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. చైనా మాంజా వల్ల మనుషులు, పక్షులు, జంతువులు తీవ్ర ప్రమాదంలో పడుతున్నాయని ఇప్పటికే నిపుణులు హెచ్చరికలు జారీ చేశారు. అయినప్పటికీ చైనా మాంజా విక్రయాలు కొనసాగుతుండటంతో అనేక మంది గాయపడుతున్నారు. కాగా.. తెలంగాణలో చైనా మాంజా విక్రయం, వినియోగం, రవాణా పూర్తిగా నిషేధించిన విషయం తెలిసిందే. హైదరాబాద్‌లో పోలీసులు ముమ్మరంగా దాడులు నిర్వహించారు. ఈ క్రమంలో హైదరాబాద్‌లో రూ. 1.24కోట్ల విలువైన చైనా మాంజా స్వాధీనం చేసుకున్నారు. చైనా మాంజా విక్రయిస్తున్న వ్యక్తులపై కేసులు నమోదు చేసిన పోలీసులు దాదాపు 143 మందిని అరెస్టు చేశారు. వేలాదిగా బాబిన్లను పట్టుకున్నారు. అటు సిద్దిపేట, సంగారెడ్డి జిల్లాల్లోనూ పోలీసులు తనిఖీలు చేసి.. చైనా మాంజా విక్రయిస్తున్న వారిపై కేసులు నమోదు చేశారు. చైనా మాంజాను పూర్తిగా నిషేధించాలని.. ఎక్కడైనా ఈ మాంజాను విక్రయించినా, వినియోగించినా సమాచారం ఇవ్వాలని ప్రజలకు పోలీసులు విజ్ఞప్తి చేశారు.

# అమెరికాలో చేరేది లేదు

**గ్రీన్‌ల్యాండ్ ప్రధాని జెన్స్ ఫ్రెడరిక్ నీల్సన్**

అమెరికాలో స్వాధీనంపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ బెదిరింపులపై గ్రీన్‌ల్యాండ్ స్పందించింది. తాము అమెరికాలో చేరబోమని, డెన్మార్క్ యూనియన్‌లోనే ఉంటామని గ్రీన్‌ల్యాండ్ ప్రధాని జెన్స్ ఫ్రెడరిక్ నీల్సన్ పేర్కొన్నారు. పరిస్థితి చాలా తీవ్రంగా ఉందని, తమ దేశాన్ని పూర్తిగా స్వాధీనం చేసుకునేందుకు అమెరికా బెదిరింపులకు దిగుతోందని మండిపడ్డారు. అమెరికానా, డెన్మార్కా ఎంపిక చేసుకోమంటే.. తాము డెన్మార్క్‌నే ఎంపిక చేసుకుంటామని స్పష్టం చేశారు. వాస్తవానికి గ్రీన్‌ల్యాండ్ డెన్మార్క్‌లో భాగమని జెన్స్ ఫ్రెడరిక్ పేర్కొన్నారు. కోపెన్‌హాగన్‌లో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. డానిష్ ప్రధాని మెట్ ఫ్రెడరిక్‌సన్ కూడా ఈ సమావేశంలో పాల్గన్నారు. అమెరికా ఉపాధ్యక్షుడు జెడి వాన్స్, విదేశాంగ కార్యదర్శి మార్క్ రూబియోలతో డెన్మార్క్, గ్రీన్‌ల్యాండ్ విదేశాంగ మంత్రులు బుధవారం జరగనున్న ఉన్నత స్థాయి చర్చలకు ముందు ఈ వ్యాఖ్యలు వెలువడ్డాయి.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: MEKALA DAMODAR REDDY. "RNI. Title- Code: TELTEL12231**. Cell:9391089608

o

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: MEKALA DAMODAR REDDY. "RNI. Title- Code: TELTEL12231**. Cell:9391089608